# సూత్రములను ఆచరణలో పెట్టడం

ఈ పరంపరలోని మొదటి రెండు భాగాల్లో లేఖనాన్ని ఎలా వివరించాలి. మొదటి పాఠకులకు ఒక వాక్య భాగం ఏ అర్థాన్నిచ్చిందో - ఎలా కనుక్కోవాలి అన్న విషయాలు చూశాము. ఈ మూడో భాగంలో లేఖనములను అన్వయించడంలో ఉపకరించే సూత్రములను చూశాము. ఆ సూత్రములను ఆచరణలో పెట్టునప్పుడు ఇవి ఎలా పనిచేస్తాయి? ఈ భాగంలోని సూచనలను ఆచరణలో పెట్టేందుకు కొన్ని సూచనలు క్రింద ఇవ్వబడ్డాయి.

### వాక్యభాగం పాత నిబంధనలో ఉంటే

**వివరణ**

ఒక వాక్య భాగం పాత నిబంధనలో ఉంటే, అది ఏరకమైన వాక్యమో చూడాలి. ధర్మశాస్త్రం, చరిత్ర, పద్య భాగం లేదా జ్ఞాన సాహిత్యం లేదా ప్రవచనమా అని చూడాలి. ఇప్పుడు మొదటి రెండు భాగాల్లో ఇయ్యబడిన సూచనల ఆధారంగా వివరణను చూడాలి.

**అన్వయింపు**

"అది ఎలా అన్వయించబడుతుంది?" అని మనం ప్రశ్నించాలి.

1. అది రాబోవుచున్న మెస్సీయా, ఆయన రాజ్యం గురించి చెప్తుందా? ఇది క్రొత్త నిబంధనలో ఉదహరించబడిందా? అలా అయితే, క్రీస్తును గురించి మన గ్రహింపునకు అది అదనంగా ఏ భావాన్నిస్తుంది?

2. పాత నిబంధనలో మర్మముగా నుండి క్రొత్త నిబంధనలో ముగింపునకు చేరిన రక్షణా కథను అర్థంచేసుకునేందుకు ఇది సహాయపడుతుందా? అలా అయితే, దేవుని విమోచనా ప్రణాళికను గ్రహించేందుకు ఇది ఎలా సహాయం చేస్తుంది?

3. దేవుని గురించి, మనుష్యుని గురించి లేదా మనుష్యునినుండి దేవుడు ఏం ఆశిస్తున్నాడన్న విషయమై ఇది ఏమైనా బోధిస్తుందా? అలా అయితే, అది ఏమని బోధిస్తుంది? ఈ సత్యములు క్రొత్త నిబంధనలోని బోధనకు ఎలా సంబంధించియున్నాయి?

4. క్రొత్త నిబంధనలో బోధింపబడిన వాక్య సూత్రములను ఇవి వివరిస్తున్నాయా? ఈ వాక్యంలోని సంఘటనలు, వ్యక్తులను ఉదహరించి క్రైస్తవులకు ఏదైనా పాఠాన్ని అందించేందుకు క్రొత్త నిబంధన గ్రంథకర్తలు దీన్ని ఉదహరించారా? అలా అయితే, ఏమిటది?

5. ఇది దేవుని మహోన్నత ప్రేమకు, ఆయన సత్య సమర్పణకు నడిపిస్తుందా? దీన్ని చదువుతుండగా, మన ఆత్మకు ఆదరణ కలుగుతుందా? ఎన్నో కీర్తనలు మన మనసును, హృదయాన్ని తాకి, మొదటి పాఠకులవలె మనకు ఆదరణనిస్తాయి.

## వాక్య భాగం క్రొత్త నిబంధనలో ఉంటే

### వివరణ

వాక్యం క్రొత్త నిబంధనలోనిదైతే, "అది ఏ రకమైన సాహిత్యం? జీవిత చరిత్ర (సువార్తలు), చరిత్ర (కార్యగ్రంథం), పత్రికలు లేదా ప్రవచనమా (ప్రకటన)?" అని ప్రశ్నించాలి. "అది సువార్తలోనిదైతే, అది ఉపమానమా?" అని ప్రశ్నించాలి. మొదటి రెండు భాగాల్లోని సూచనలననుసరించి వివరణ చూడాలి. తరువాత వాక్య భాగం మొదటి పాఠకులకు ఏ అర్థానిచ్చిందో చూడాలి.

### అన్వయింపు

"అది ఎలా అన్వయిస్తుంది?" అని ప్రశ్నించాలి. *క్రొత్త నిబంధనలో ఎక్కువ వాక్య భాగం మొదటి పాఠకులకు ఎలా అన్వయింపబడిందో అలాగే మనకూ అన్వయింపబడుతుంది.* అటువంటప్పుడు వివరణే అన్వయింపు అవుతుంది. మొదటి పాఠకులకు అది ఏ అర్థాన్నిచ్చిందో గ్రహించిన తర్వాత, అది మనకూ అదే అర్థాన్నిస్తుందని గ్రహిస్తాము. ఒక వాక్యం మనకు ఎలా అన్వయించబడుతుందో గ్రహించేందుకు మనమీ ప్రశ్నలు అడగాలి:

1. "వాక్యాన్ని అన్వయించునప్పుడు, ఏ విధమైన కష్టాలు అందులో ఉంటాయి?"
   (అ) "దాని అసలు సందర్భంలో అది ఏ అర్థం ఇస్తుందో నేను తెలుసుకోగలనా?" మొదటి పాఠకులకు ఇచ్చిన అర్థం అస్పష్టంగా ఉంటే, దానిని మన పరిస్థితులకు మరింత సిద్ధాంతపరంగా అన్వయించుటలో జాగ్రత్తగా ఉండాలి.
   (ఆ) "అసలు సందర్భంలోని మరియు ఈనాటి సందర్భంలోని వాక్యం మధ్యగల భేదం అన్వయింపును ప్రభావితం చేస్తుందా?"
   (ఇ) "ఈ వాక్యం కొంత కష్టతరమును – బహుశ మరో వాక్యంతో భేదమును అంటే – వ్యాఖ్యానం లేదా అన్వయింపునో యిస్తుందా?"

2. ఒకవేళ సమస్యలేవి లేకపోతే, లేదా ఆ సమస్యలు తీరిపోతే, "వాక్యాన్ని నా అనుదిన జీవితమునకు ఎలా అన్వయించాలి?" అని ప్రశ్నించాలి.
   (అ) "ఈ వాక్యంలో ఏ వేదాంత సత్యములు బోధింపబడుతున్నాయి లేదా కనబడుతున్నాయి?" క్రొత్త నిబంధనలోని ప్రతి వాక్యం క్రైస్తవులను ప్రోత్సహించేది హెచ్చరించేది కాదు. కొన్ని వాక్యములు సువార్త సందేశాన్ని మరింతగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి.
   (ఆ) "ఈ వాక్య బోధన బైబిలులో మరోచోట వాక్య బోధనకు ఎలా సంబంధించియుంది?" ఒక వాక్య అంశంపై నిర్దిష్ట సత్యమును కనుగొను విధమేమంటే, ఆ అంశమునకు సంబంధించి వాక్యం చెప్తున్న ప్రతి వాక్యాన్ని పరిశీలించడం.
   (ఇ) "ఈ వాక్యం నానుండి ఏదైనా ఆశిస్తుందా? ఈ వాక్యం ఆశిస్తున్న దాన్ని నేనెలా ఆచరించగలను?"
   (ఈ) "ఈ వాక్యంలోని సత్యం నాకెలా ఉంది? దీనునుండి నేను సమాధానం

పొందగలనా? దీని చేత నేను కదిలింపబడ్డానా? దీనివలన దేవుని చిత్తాన్ని మరింతగా చేయుటకు నేను బోధింపబడ్డానా?”[1]

### ఒక ఉదాహరణ: రోమీయులకు 12:1, 2

ఈ సూత్రములను ఎలా ఆచరణలో పెట్టాలో ఈ క్రింది వివరణ అన్వయింపును చూడండి. వాక్యం రోమీయులకు 12:1, 2:

> కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సుమారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి.

**వివరణ**

“కాబట్టి” అను మాటను బట్టి, ఇంతకు ముందు రోమీయులకు వ్రాసిన వివరములన్నిటిని దీనికి కలిపి చెప్తున్నాడు పౌలు, పత్రికలో ఇక్కడ దేవుని కృప, దయను పౌలు నొక్కి చెప్తున్నాడు. మన శరీరములను పరిశుద్ధమును, దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా అర్పించుటలో “దేవుని వాత్సల్యం” కారణం అని పౌలు చెప్తున్నాడు. (బహు వచనాన్ని గమనించండి: దేవుని “వాత్సల్యములు” అని ఇవ్వబడింది). పాత నిబంధనలో అర్పించబడిన యాగములు మృత జంతువులు. ఈ నాడు అర్పించబడుతున్న యాగములు “సజీవములు.” మనలను మనమే సమర్పించుకుంటున్నాము. ఇటువంటి యాగములు దేవునికి అర్పించబడుతున్నాయి (“పరిశుద్ధం” అంటే ఇదే). పౌలు ప్రకారం ఇది “యుక్తమైన సేవ” (spiritual service of worship) ఇదే మాట విభిన్న తర్జుమాలలో విభిన్నంగా అనువదించబడింది. “ఇది యుక్తమైన సేవ” (KJV); “మీ ఆత్మీయ ఆరాధన” (RSV); “మనసుతోను, హృదయముతోను జరిగించు సేవ” (NEB); “జ్ఞానయుక్త ఆరాధన” (Phillips); “మీ ఆత్మీయ ఆరాధన” (NIV). మన శరీరములను దేవునికి అర్పించడం అనేది … దేవునికిచ్చే “ఆత్మీయ” లేదా “యుక్తమైన సేవ” లేదా “ఆరాధన” (ఇదే సంఘ కూడికకు భిన్నం).

మన శరీరములను దేవునికి సజీవ యాగముగా ఎలా అర్పించగలం? రోమీయులకు 12:1 వాక్యాన్ని 12వ అధ్యాయమునకు (బహుశ మిగతా రోమా పత్రిక యంతటికీ) “ముఖ్య వాక్యంగా” పరిగణించవచ్చు. 2వ వచనం ప్రకారం, ఈ లోక మర్యాదను అనుసరింపక యుండడం ద్వారా, అనగా, ఈ లోక ప్రకారం ఉండకుండడం ద్వారా మనం దేవునికి యాగంగా ఉండగలము (పోల్చండి యాకోబు 1:27; 1 యోహాను 2:15). మన మనసు మారి నూతనమగుట ద్వారా రూపాంతరం పొందగలం. మనం నేరుగా ఆలోచించడం నేర్చుకోవాలి. దేవుడు చూచునట్లు చూడాలి. అప్పుడు, దేవుని చిత్తమేదో మనం గ్రహించగలం. “పరీక్షించి” అనే పదమునకు, “నిరూపించడం” లేదా (“అనుసరించి తెలుసుకోవడం” అని అర్థం; Phillips). లోక రీతిగా ఉండక రూపాంతరం పొందుట ద్వారా మనలను మనం

దేవునికి సమర్పించుకుంటే, అప్పుడు దేవుని చిత్తం చేయడం ద్వారా వచ్చే ఆశీర్వాదములను మనం పొందగలం. దేవుని చిత్తము, "ఉత్తమము, అనుకూలము, సంపూర్ణము" అని 2వ వచనం చెప్తుంది. దేవుని చిత్తంకంటే ఈ లోకంలో మరేది సంపూర్ణం కాదు.

## అన్వయింపు

ఈ వాక్యం క్రొత్త నిబంధనలో ఉందని, మొదటి శతాబ్దపు క్రైస్తవులకు వ్రాయబడిన ఒక పత్రికలోనిదని మనం చూస్తున్నాము. కాబట్టి, *దేవుడు దైవావేశిత క్రొత్త నిబంధన గ్రంథకర్తల ద్వారా క్రైస్తవులకు యిచ్చిన సందేశం ఈనాడు మనకు అన్వయించబడుతుందని చెప్పగలం.* మరో కారణం కాదనేది ఇందులో కనబడ్డంలేదు.

రోమీయులకు 12:1, 2 విషయంలో వేరే విధంగా భావించే కారణాలు ఏమైనా ఉన్నాయా?

"వాక్య అర్థం స్పష్టంగా ఉందా?" అవును, "ఇది యుక్తమైన సేవ" అన్న వాక్య విషయంలో వ్యాఖ్యానకర్తలు విభిన్నంగా చెప్పే ఈ వాక్యాల ప్రాథమిక అర్థం విషయంలో మాత్రం విభేదించడం లేదు.

"ఈ వాక్యాన్ని అర్థం చేసుకునేందుకు, లేదా అన్వయించేందుకు దీనిపై ప్రభావితం చేసే అప్పటి నేపథ్యం మరియు ఇప్పటి నేపథ్యమునకు మధ్య భేదం ఏదైనా ఉందా?" లేదు. మొదటి పాఠకులు భిన్న పరిస్థితులలో, భిన్న ప్రాంతాలలో ఉన్నా, క్రైస్తవులందరూ, అన్ని సందర్భాలకు ఇది అన్వయించబడుతుంది.

"ఈ వాక్యంలో ఏదైనా గ్రహింప కష్టమైనవి ఉన్నాయా? ఉదాహరణకు, ఇది ఏదైనా వాక్యంతో విభేదిస్తుందా?" లేదు. మరి దీన్ని ఎలా అన్వయించగలం?

"ఈ వాక్యంలో ఏ వేదాంత సత్యాలు బోధింపబడ్డాయి?" మొదటిగా, ఈ వాక్యం మానవుని స్వభావం గురించి చెప్తుంది. మానవునికి కేవలం శరీరం మాత్రమే కాదు ఉన్నది, మానవులకు ఉన్న దేహమే మానవుడు కాదు అని ఇది చెప్తుంది.

"ఈ వాక్యంలోనున్న బోధన మరోచోట బోధనకు ఎలా సంబంధించియుంది?" మనం దేవునికి సంపూర్ణంగా సమర్పించుకోవాలని వాక్యం మరో చోట చెప్తుంది (మనఃపూర్ణంగా దేవున్ని ప్రేమించాలి) అలాగే మనం, "ఈ లోక రీతిని అనుసరింపకూడదు."

"ఈ వాక్యం నానుండి ఏం ఆశిస్తుంది? ఈ వాక్యం చెప్తున్న దానిని నేనెలా ఆచరించాలి?" వీటిని మనకు మనమే సమాధానమియ్యాలి. ఒక క్రైస్తవునికి, సజీవయాగముగా సమర్పించుకోవడమంటే, బైబిలు తరగతిలోని బోధనలను సమర్పించుకోవడం. మరొకరికి, తను ఇచ్చేది యాభయ్యవవంతు ఇవ్వడం. మరొకరికి, పాపపు అలవాట్లను తీసివేయడం, ప్రార్థనలో, వాక్యంలో మరి ఎక్కువ సమయం గడపడం. "నేను దేవునికి సంపూర్ణంగా సమర్పించుకోవాలంటే ఏం చేయాలి?" అని ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ప్రశ్నించుకోవాలి.

ఇక్కడ. "ఈ వాక్యంలో చెప్పబడిన సత్యం విషయమై నేను ఎలా భావిస్తున్నాను?" మనము పరిశుద్ధ సజీవ యాజకులుగా ఉండబోతున్నామన్న భావన ఎంతో ఉద్వేగంగా ఉండాలి – మనం బలిపీఠం మీద జంతువును ఉంచాలని దేవుడు ఈనాడు కోరడం లేదు గాని, మనమే దాని మీద బలిగా అర్పించబడాలని ఆయన కోరుతున్నాడు!